క్లుప్తంగా

ప్రజాప్రతినిధులతో ఆమంచి సమావేశం

చినగంజాం: మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులతో పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ శనివారం సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ అనంతరం అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చిద్దామని వారికి తెలియజేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

అద్దంకి రూరల్: జాతీయ సైన్స్ డే సందర్భంగా స్థానిక నాగార్జున పాఠశాల విద్యార్థులు శనివారం వాసవి కళాశాల ఆవరణలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. సీఐ రోశయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఉన్న అభిరుచిని ప్రశంసించారు. పాఠశాల కరస్పాండెంట్ ఏవీఎస్, విశ్వభారతి హైస్కూల్ కరస్పాండెంట్ వి. హనుమంతరావు, పాఠశాల ప్రిన్సిపాల్ టి. రామకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూనూరులో ఫ్యామిలీ డాక్టర్

యద్దనపూడి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేదప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం మండలంలోని పూనూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వీరబ్రహ్మం 128 మందికి బీపీ, షుగర్, గర్భిణులకు హెచ్‌బీ, యూరిన్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. సీహెచ్‌ఓ టీపీఎస్ ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

పర్చూరు: నో యాక్సిడెంట్ డే పురస్కరించుకొని పర్చూరు ఎస్‌ఐ ఎన్‌సీ ప్రసాద్ ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం రోడ్డు భద్రతపై రైతు కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాక్సిడెంట్‌లు జరిగితే మీతో పాటు మీ కుటుంబంలోని వారికి కూడా తీరని నష్టం సంభవిస్తుందన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

చినగంజాం: సైన్సు దినోత్సవం సందర్భంగా పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎం. దేవదత్తం సైన్సు ఉపాధ్యాయులు బి. నాగేశ్వరరావు, ఎల్. శివప్రసాద్, డి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరి పట్నంకి చెందిన ఉమ్మిటి తారక రామారావు క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ. 40 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం బాధితుడికి అందజేశారు. పందిళ్లపల్లి శివాలయం అర్చకులుగా పనిచేస్తున్న పొన్నూరు రామలింగేశ్వర శర్మ కిడ్నీ మార్పిడి వైద్య ఖర్చుల నిమిత్తం ఎన్ఆర్ఐ పేరిశెట్ల నాగేశ్వరరావు రూ.1.80 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు.

జగనన్న లే అవుట్ పరిశీలన

మార్టూరు: మండలంలోని జగనన్న లే అవుట్ గృహాలను శనివారం హౌసింగ్ పీడీ డాక్టర్ బి. అర్జునరావు పరిశీలించారు. ప్రతి శనివారం నిర్వహించనున్న స్పెషల్ హౌసింగ్ డేను పురస్కరించుకొని ఆయన మండలంలోని జొన్నతాళి, ద్రోణాదుల గ్రామ పంచాయతీలో సందర్శించి లే అవుట్‌లను పరిశీలించారు. ఎంపీడీఓ జి. నితిన్, ఏఈ విజయనాథ్, ఏపీఎం రాదారత్నం పాల్గొన్నారు.

ఇక హ్యాపీ జర్నీ

- రూ. 5 కోట్లతో చీరాల– స్వర్ణ రోడ్డు
- తీరిన పలు గ్రామాల సమస్య

చీరాల: నిన్న మొన్నటి వరకు ఆ రోడ్డుపై వెళ్లాలంటే నరకమే. అడుగడుగునా లోతైన గుంతలు. రాత్రి వేళ గుంతలు కనిపించక నిత్యం ప్రమాదాలతో ప్రయాణం చేయాల్సి ఉండేది. అనేక గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉండే స్వర్ణ రోడ్డు గత ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోలేదు. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రధాన రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించింది. స్థానిక ఎమ్మెల్యే కరణం బలరాం చీరాల– స్వర్ణ రోడ్డును విస్తరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించడంతో ప్రభుత్వం రూ. కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేసింది. చీరాల పరిధిలో కారంచేడు రోడ్డులోని ఎఫ్‌సీఐ గొడౌన్స్ నుంచి కారంచేడు మండలం స్వర్ణ వరకు తారు రోడ్డును నిర్మించారు. దీనికి తోడు గతంలో ఉన్న రోడ్డును విస్తరించి వెడల్పు చేశారు. పది మీటర్ల వెడల్పు మేర 2.8 కిలో మీటర్ల రోడ్డును నిర్మించారు. అలానే చీరాల నగర్ సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలకు ఈ రోడ్డును కలిపారు. దీంతో జగనన్న కాలనీ వాసులకు ప్రధాన రోడ్డు ఏర్పాటైంది. స్వర్ణ పరిసర గ్రామాల ప్రజలు నిత్యం వివిధ అవసరాల నిమిత్తం చీరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. భవిష్యత్తులో దండుబాట రోడ్డును విస్తరించి డబుల్ లైన్ రోడ్డుగా నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నట్లు డీఈ నరసింహులు తెలిపారు.



నూతనంగా నిర్మించిన రోడ్డు

240 గ్రాముల గంజాయి పట్టివేత

చీరాల: గంజాయిని గుట్టుగా అమ్మేందుకు సిద్ధం చేసిన 240 గ్రాముల గంజాయిని టూటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ జి.సోమశేఖర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ జి. సోమశేఖర్ తన సిబ్బందితో కలిసి చీరాల రోశయ్య కాలనీలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులు దేవర లక్ష్మీనారాయణ, దేవర రవి, దేవర సింధూజలను తనిఖీ చేయగా వారి వద్ద నుండి 240 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 24 పొట్లాలుగా కట్టి యువకులకు అమ్మేందుకు సిద్ధం చేసినట్లు నిర్ధారించుకుని వారిని అరెస్ట్ చేశామన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కేసులో పాల్గొన్న సీఐ సోమశేఖర్, ఎస్సై చంద్రావతి, హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్, కానిస్టేబుల్ అహ్మద్ బాషా, కానిస్టేబుల్ సుబ్బారావు, మహిళా కానిస్టేబుల్ మార్తమ్మను ఎస్పీ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయితో కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ సోమశేఖర్

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

జె.పంగులూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో రమణమూర్తి అధ్యక్షతన, ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షత శనివారం మండల కేంద్రం అయిన పంగులూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఎంపీడీవో రమణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆర్థిక పరమైన విషయాలు చర్చించకుండా, సాధారణ విషయాలు మాత్రమే చర్చకు తీసుకురావాలని సభ్యులను కోరారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో 20 వేల ఎకరాలు పంట నమోదు చేశామని, రబీలో 10,600 ఎకరాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 28న ఈ క్రాప్ యాప్ క్లోజ్ అవుతున్నందున ఈ క్రాప్ నమోదు చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలి తెలిపారు. మండల ఉపాధ్యక్షులు యత్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయిణి వెంకటసుబ్బారావు, కో ఆప్షన్ సభ్యులు ఖాసీం, అధికారులు సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి

విజిలెన్స్ అదుపులో గ్రానైట్ లారీలు



విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్న గ్రానైట్ లారీలు

బల్లికురవ: పర్మిట్‌లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు గ్రానైట్ లారీలను శనివారం మైన్స్ విజిలెన్స్ ఏడీ కొండారెడ్డి బల్లికురవ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఈర్ల కొండ నుంచి పర్మిట్‌లేకుండా మార్టూరు వైపు గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న ముడిరాయి, మీటరురాయి లారీలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. పర్మిట్ లేకుండా మీటరు, ముడిరాళ్లు, శ్లాబులు తరలించటం చట్టరీత్యా నేరమని పెనాల్టీతో పాటు కేసులు నమోదు చేస్తామని ఏడీ హెచ్చరించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పర్చూరు: స్థానిక శ్రీ సతీష్ ట్రేడర్స్, మహాలక్ష్మి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను గుంటూరు, ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సతీష్ ట్రేడర్స్‌లో డీబీటీ మెషీన్ అమ్మకానికి, భౌతిక నిల్వలకు వ్యత్యాసం ఉంది. అలాగే మహాలక్ష్మి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రూ. 1,12,000 విలువ చేసే ఎస్‌ఎస్‌పీ ఎరువు డీబీటీ మిషన్ అమ్మకానికి, భౌతిక నిల్వలకు వ్యత్యాస ఉండటంతో కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఏఓ జే వాసంతి, విజిలెన్స్ ఎస్ఐ గుంటూరు ఎం. రామచంద్రయ్య, ఒంగోలు సీఐ బీవీవీ సుబ్బారావు, ఎస్ఐ జి. నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి ఎస్. రామ్మోహనరెడ్డి పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి కావాలి



చీరాలనగర్ లేఅవుట్‌లో సూచనలందిస్తున్న ఆర్డీవో సరోజిని

చీరాల టౌన్: నిరుపేదలకు కలగా ఉన్న సొంతింటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఉగాది రోజున గృహ ప్రవేశాలు చేసుకోవాలని చీరాల ఆర్డీవో పి.సరోజిని సూచించారు. హౌసింగ్ డే పురస్కరించుకుని శనివారం చీరాల మండలంలోని చీరాల నగర్ 1, చీరాల నగర్ 2 లేఅవుట్లలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను ఆర్డీవో పరిశీలించారు. నిరుపేదలకు సొంతింటిని అందించిన సీఎం జగన్ పేదల పెన్నిధిగా నిలిచారన్నారు. చీరాల నగర్ లేఅవుట్లలో ఇంటి పట్టా పొందిన లబ్ధిదారులు త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఉగాది పండగకు గృహ ప్రవేశాలు చేయాలన్నారు. ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని త్వరగా నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలన్నారు. పొదుపు మహిళలకు అదనంగా రూ.35వేలు రుణం కూడా అందిస్తున్నామన్నారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో నేతాజీ, హౌసింగ్ డీఈ గోవిందరెడ్డి, ఏఈ శ్రీనివాసులు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

టర్కీ భూకంప బాధితులకు మందుల ఎగుమతి



సామగ్రిని అందిస్తున్న ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు సుభాషిణి

చీరాల అర్బన్: స్థానిక రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో టర్కీ భూకంప బాధితులకు రూ.45 వేలు విలువ చేసే ఔషధ సామగ్రిని శనివారం హైదరాబాద్‌లోని టర్కీ కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఐ.సుభాషిణి అందించారు. భూకంప బాధితులకు తమ వంతు సహాయంగా మందులు, చిన్నపిల్లలకు సెరిలాక్, చిక్కీలు, శానిటరీ న్యాప్‌కిన్స్ అందించినట్లు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

పర్చూరు: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్చూరు జూనియర్ కాలేజీ ఆవరణలో నాలుగు మండలాల స్థాయిలో 10 పాఠశాలల నుంచి విద్యార్థులు వాలీబాల్ పోటీలు శనివారం నిర్వహించారు. ఇంకొల్లు నివేదిత హైస్కూల్, వీరన్నపాలెం గవర్నమెంట్ హైస్కూల్, నాగులపాలెం గురుకుల పాఠశాల బాలికలు వరుస స్థానాల్లో నిలిచారు. పీడీ ఈదర చింపారెడ్డి, పౌలస్, బి. నాగగోపి, రేపూరి దుషి, ఆర్. నిర్మల పుష్పరాణి, ఏ. చంద్రిక పర్యవేక్షించారు. కాలేజీ కరస్పాండెంట్ కృష్ణంశెట్టి రమేష్ బాబు బహుమతులు అందజేశారు. వంటి సదానందరెడ్డి, గడిపాటి శ్రీనివాసరావు, కోట హరిప్రసాద్, కోమటి ఆంజనేయులు, కొల్లా నరేంద్ర, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

ప్రతిభామూర్తులను స్మరించడం కర్తవ్యం

అద్దంకి రూరల్: ప్రతిభామూర్తులను స్మరించుకోవటం మన బాధ్యత అని జనచైతన్య వేదిక కన్వీనర్ అన్నమనేని వెంకట్రావు అన్నారు. శనివారం రాత్రి ఏపీయస్ ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్వర్యంలో స్థానిక క్యూర్‌అండ్ కేర్ హోమియో వైద్యశాల ఆవరణలో వినుకొండ శివరామయ్య స్మారక కళావేదిక లో ప్రతిభామూర్తుల సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాయకుడు శేషగిరి అధ్యక్షత వహించారు. గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, సినిమా నటుడు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, అద్దంకి రంగస్థల కళా కారుడు వినుకొండ శివరామయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనచైతన్య వేదిక కన్వీనర్ వెంకట్రావు మాట్లాడుతూ ఘంటసాల వెంకటేశ్వరరావు గాయకుడిగానే అందరికి తెలుసునని ఆయన గాయకుడు అవటానికి చేసిన కృషిని వివరించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు జైలు శిక్షకూడా అనుభవించారన్నారు. ఇటీవల మరణించిన దర్శకుడు కె.విశ్వనాథ్, గాయని వాణీ జయరామ్‌లకు నివాళులర్పించారు. గాడేపల్లి దివాకరదత్తు డీవీయం సత్యనారాయణ, అద్దంకి లెవీ ప్రసాద్, మన్నెం త్రిమూర్తులు, వారణాసి రఘురామశర్మ, ఎస్.కె ఖాసిం, మహమ్మద్ రఫీ, కూరపాటి రామకోటేశ్వరరావు, ముప్పప్రసాద్, కొల్లా భువనేశ్వరీ, చందలూరి నారాయణరావు, ఆర్వి రాఘవరావు, వినుకొండ శివరామయ్య పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌గా పారిశుద్ధ్య కార్యక్రమాలు

బల్లికురవ: సీజనల్ జ్వరాలు వ్యాధులు సోకకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌గా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఈవోఆర్డీ జి. సీతామహాలక్ష్మి కోరారు. శనివారం సోమవరప్పాడు, న్యకొక్కలపాడు, వేమవరం, కొప్పరపాడు గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. సైడు కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు



పట్టభద్రుల నియోజకవర్గం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఈఆర్వో ప్రభాకరరావు

చీరాల టౌన్: మార్చి 13న జరగనున్న ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నామని ఏఈఆర్‌వో, మండల తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు చీరాల పట్టణంలోని ఎన్ఆర్ అండ్ పీఎం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలను ఎంపిక చేయగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు.

100 శాతం పన్నులు వసూలు చేయాలి

చీరాల టౌన్: గ్రామాల్లో పెండింగ్ బకాయిలు, ఇంటి పన్నుల వసూళ్లను పంచాయతీ కార్యదర్శులు మార్చి నెలాఖరు లోపు 100 శాతం వసూళ్ల చేయాలని ఎంపీడీవో నేతాజీ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. గ్రామాల వారీగా ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోవడంతో అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. పంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి రోజువారీగా పారిశుద్ధ్య సమస్యలను లేకుండా చేయాలన్నారు.

పోయిన సెల్ ఫోన్ అందజేత



బాధితురాలికి సెల్‌ఫోన్‌ను అందిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

మేదరమెట్ల: కొరిశపాడు మండల పరిధిలో ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కొరిశపాడు ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధునిక పద్ధతులను ఉపయోగించి సెల్‌ఫోన్ ఎక్కడ ఉంది తెలుసుకొని దాన్ని బాధితురాలికి శనివారం అందచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రయాణాలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కొత్త వారిని నమ్మి ఎలాంటి విలువైన వస్తువును వారికి ఇవ్వవద్దని తెలియచేశారు. ఏటీఎంల వద్ద సొమ్ము డ్రా చేసుకునే సమయంలో ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో ఓటీపీలుగానీ, కార్డు పిన్ నెంబర్లు కానీ చెప్పవద్దని ఎస్ఐ హెచ్చరించారు.

పశువుల్లో పునరుత్పత్తి పెంచడమే లక్ష్యం

బల్లికురవ: పశువుల్లో పునరుత్పత్తితో పశుసంతతి పెంచటమే ప్రభుత్వ లక్ష్యమని ఉమ్మడి ప్రకాశం జిల్లా సెమన్ బ్యాంకు ఈవో షేక్ కాలేషా వెల్లడించారు. శనివారం స్థానిక పశు వైద్యశాలలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల పశు వైద్యాధికారులు సిబ్బంది, గోపాల మిత్రులతో పునరుత్పత్తిపై సమీక్షించారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల ఏడీ పద్మావతి బల్లికురవ, పెదఅంబడిపూడి, కె.రాజుపాలెం, కూకట్లపల్లి వైద్యాధికారి పి.మహేశ్వరి, ఆర్. పావని కుమారి, వెంకటరావు, శిరీష పాల్గొని మాట్లాడారు.

పురాతన నాణేల ప్రదర్శన



నాణేల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు, నిర్వాహకులు

యద్దనపూడి: స్థానిక ముద్దన హనుమయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జై జపాలి చారిట్రబుల్ ట్రస్టు ఆదిపూడి వారి ఆధ్వర్యంలో కొలువు రఘురామయ్య సేకరించిన పాత నాణేల ప్రదర్శన నిర్వహించారు. 1807 నుంచి 2007 వరకు వివిధ దేశాలకు సంబంధించిన వాటిని విద్యార్థులు తిలకించారు. పూర్వకాలం ఉపయోగించే అణ, అర్ధ అణతో పాటు కాలక్రమేణ మనదేశంతో పాటు వివిధ దేశాల్లో వినియోగించిన 400 రకాల నాణేలను, కరెన్సీ నోట్లను ప్రదర్శించారు. హెచ్‌ఎం జంగా పోతురాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై దూషణలా ?

బల్లికురవ: ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించేందుకు ఎంఆర్‌సీ కార్యాలయానికి వెళ్లగా ఎంఈవో వ్యక్తిగతంగా దూషించడం బాధాకరమని యూటీఎఫ్ నేతలు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో వాపోయారు. సంవత్సరం నుంచి ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోకుండా అమర్యాదకరంగా ప్రవర్తించటం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి, ఆర్జేడీ, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఎంఈవో తన పంథాను మార్చుకుని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని సంఘ బాధ్యులు దూళిపాళ్ల శేషగిరి చంటి శ్రీనివాసరెడ్డి, పాలపర్తి రామాంజనేయులు సీహెచ్ అచ్యుతమోహన్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

కారంచేడు: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటితే దాని వలన భవిష్యత్తులో ఎంతో మేలు జరుగుతుందని ప్రధానోపాధ్యాయురాలు విజయమ్మ అన్నారు. శనివారం కారంచేడు ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 'గ్రీన్‌డే' కార్యక్రమంలో మాట్లాడారు. జగదీశ్వరి, శివలీల, పద్మ, సాయిసుజాత, రమాదేవి, ఉపాధ్యాయులు, మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడవాడలా పారిశుద్ధ్య కార్యక్రమాలు

మేదరమెట్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో పంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. మేదరమెట్లలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఎంపీడీవో సురేష్‌బాబు, సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, ఈవో లక్ష్మీకాంత్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి శనివారం రోజున గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నుంచి సేకరించిన పొడి, తడి చెత్త ద్వారా మొక్కలకు ఆరోగ్యకరమైన ఎరువును తయారు చేస్తామని.. తడి, పొడి చెత్తలను వేరువేరుగా వేయాలని తెలిపారు.

నిత్యావసరాల వితరణ

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురంలో గల అనాథ వృద్ధ శరణాలయానికి ఫిడికిలి ఫౌండేషన్ సేవా సంస్థవే ప్రొవిజన్స్‌ను శరణాలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. కమిటీ శాశ్వత కన్వీనర్ విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, టి. కోటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, షేక్ నూర్ మహమ్మద్, పి. నాగవరప్రసాద్ పాల్గొన్నారు.

పిల్లలకు ఉపకరణాలు

అద్దంకి: వైకల్య పరీక్షలు చేయించుకున్న పిల్లల్లో అవసరమైన వారికి అవసరమైన ఉపకరణాలను త్వరలో ఉచితంగా అందజేయనున్నట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త నాగేంద్రమ్మ అన్నారు. ఆమె సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వైకల్య నిర్ధారణ పరీక్షల శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫిజియో థెరపీతో సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. వైద్య శిబిరంలో మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయచంద్రరావు, మేడిపల్లి సీహెచ్‌సీ వైద్యాధికారి టి. నాగకోటేశ్వరరావు, ఆడియాలజిస్ట్ పి. చంద్రయ్య, అప్తమాలజిస్ట్ లాస్య, ఫిజియోథెరపిస్ట్ యం. ఇందిర ప్రియదర్శిని పాల్గొని పరీక్షలు నిర్వహించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

యద్దనపూడి: ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సంబంధించిన భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణ కుమారి అధికారులకు సూచించారు. శనివారం పూనూరు, యనమదల, చిలుకూరివారిపాలెం, అనంతవరం సూరవరపుపల్లిలో అధికారులతో కలిసి పురోగతిని పరిశీలించారు.

వాహనాల తనిఖీ

బల్లికురవ: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం తరలిస్తే ఎంతటివారిపైన అయినా కేసులు నమోదుతో సీజ్ చేస్తామని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి జి. సీతామహాలక్ష్మి హెచ్చరించారు. శనివారం సాయంత్రం బల్లికురవ, సంతమాగులూరు, ఆర్అండ్‌బీ రోడ్డులోని మల్లాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. ఏఎస్సై సి. బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.